సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 24 । జూన్ । 2025



అనకాపల్లిలో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం శ్రేణులు, నిరుద్యోగులు

జడివానలో యువ గర్జన



వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో కదం తొక్కిన నిరుద్యోగులు

మాట తప్పిన కూటమి సర్కారుపై 'యువత పోరు'

బైక్ ర్యాలీకి అనుమతి ఇవ్వని పోలీసులు

అనకాపల్లి రింగ్‌రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో యువత, నిరుద్యోగులు, విద్యార్థులకు చేసిన మోసాన్ని ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో యువత కదం తొక్కింది. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పోరు బాట పట్టింది. ఈ నిరసన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వందలాదిగా యువత, విద్యార్థులు, నిరుద్యోగులు తరలి వచ్చారు.

సాక్షి, అనకాపల్లి: లక్షలాది ఉద్యోగాలన్నారు.. లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు.. ఎన్నో ఆశలు కల్పించారు.. యువత కలలను కల్లలు చేశారు.. అందుకే కూటమి సర్కారు కుటిల బుద్ధికి నిరసనగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం సోమవారం చేపట్టిన 'యువత పోరు'కు నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నినాదాల రూపంలో తమ నిరసన వ్యక్తం చేశారు. తొలుత అనకాపల్లి టౌన్‌లో రింగు రోడ్డు వద్ద గల వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ చేపట్టాలని భావించారు. కానీ పోలీసులు బైక్ ర్యాలీకి అనుమతి ఇవ్వలేదు. దీంతో అక్కడ నుంచి సబ్బవరం హైవేలో గల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆర్చి వరకు కార్లతో మూడు కిలోమీటర్ల మేర నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లారు. కలెక్టర్ కార్యాలయం ముందు యువత, నిరుద్యోగులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని ధర్నా చేశారు. జాబు రాలేదు.. భృతి ఇవ్వలేదంటూ నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో గ్రీవెన్స్‌లో ఉన్న జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణకు వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సారథ్యం వహించగా, సమన్వయకర్తలు అన్నంరెడ్డి అదీప్‌రాజు, మలసాల భరత్‌కుమార్, అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు శోభా హైమావతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్‌రాజా, పెందుర్తి, నర్సీపట్నం, యలమంచిలి నియోజకవర్గాల యువజన విభాగం అధ్యక్షులు పెదపాటి శేఖర్, తమరాన శ్రీను, నాగ నూకరాజు, జిల్లాలోని 24 మండలాల యూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

భృతి ఎప్పుడు ఇస్తారో చెప్పాలి



నేను పీజీ పూర్తి చేశాను. సరైన ఉద్యోగం దొరకడం లేదు. నెలకు 6 నుంచి 8 వేలు మాత్రమే ఇస్తామని చెబుతున్నారు. నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తే ఇంటి వద్దనే ఉండి పోటీ పరీక్షలకు చదువుకుంటాను. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన నేతలు ఇప్పుడు కనిపించడంలేదు.

–కలవలపల్లి మదన్, అనకాపల్లి మండలం

నిలువునా మోసపోయాం



డిగ్రీ పూర్తి చేసి మూడు సంవత్సరాలయింది. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి నాయకుల్లో ఏ ఒక్కరు నిరుద్యోగ భృతిపై అసెంబ్లీలో మాట్లాడకపోవడం బాధ కలిగిస్తుంది. ప్రశ్నిస్తానన్న జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎందుకు మాట్లాడడం లేదో తెలీదు.

–బూర బాలాజీ, చోడవరం మండలం



కలెక్టరేట్ వద్ద నిరసనకారులను అడ్డుకున్న పోలీసులు

ఉన్న ఉద్యోగాలు పీకేశారు..



ఏడాది కూటమి ప్రభుత్వంలో కొత్త ఉద్యోగాలు లేవు సరి కదా.. ఉన్న ఉద్యోగాలు పీకేశారు. రాష్ట్రంలో పేద విద్యార్థులకు ఉచిత విద్య లేదు. కొత్త పరిశ్రమలు లేవు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతి సౌకర్యాలు కూడా కల్పించకుండా విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను మూసేసి.. ప్రైవేట్ విద్యను ప్రోత్సహిస్తున్న ఈ కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పి తీరుతాం. యువత, నిరుద్యోగులతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం.

– జాజుల రమేష్, అనకాపల్లి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు

నినాదాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

చంద్రబాబు డౌన్ డౌన్.. అంటూ సాగిన నినాదాలతో కలెక్టరేట్ దద్దరిల్లింది. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చి, ఇప్పుడు నిలువునా మోసగించారని యువత కన్నెర్ర చేసింది. రాష్ట్రంలో కొత్తగా 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, లేకుంటే నిరుద్యోగ భృతిగా రూ.3 వేలు అందజేస్తామని, ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి.. మాట తప్పడంపై నిరసన వెల్లువెత్తింది. నెలకు రూ.3 వేల వంతున ఒక్కో నిరుద్యోగికి రూ.36 వేలు బాకీ పడ్డారు.. జిల్లాలో ఉన్న 2.30 లక్షల నిరుద్యోగులకు రూ.828 కోట్లు ఎప్పుడు చెల్లిస్తారని నిలదీశారు.



కలెక్టరేట్‌లో డీఆర్వో సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగం నాయకులు, నిరుద్యోగులు

ఇది కూటమి కుట్ర ప్రభుత్వం



విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదు. వసతి దీవెన, విద్యార్థి దీవెన ఇవ్వలేదు. నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి వంతున ఒక్కొక్కరికీ రూ.36 వేలు బాకీ పడ్డారు. నిరుద్యోగులకు ఇవ్వాల్సిన బకాయితో పాటు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలి. కూటమి ప్రభుత్వానికి నెల రోజుల సమయం ఇస్తున్నాం. ఈలోగా ఏడాది నిరుద్యోగ భృతి బకాయిలతోపాటు ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన, వసతి దీవెన నిధులు విడుదల చేయాలి. లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం. ప్రభుత్వం మెడలు వంచుతాం.

– పుల్లేటి వెంకటేష్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు

విద్యార్థులను ఇబ్బంది పెట్టడంలో రికార్డు



యోగాంధ్ర పేరుతో రూ.300 కోట్లకు పైగా ఖర్చు చేసి విద్యార్థులను ఇబ్బంది పెట్టడంలో చంద్రబాబు రికార్డు నెలకొల్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం తీసేశారు. ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేసి..ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు చేరేలా కుయుక్తులకు పాల్పడుతున్నారు. నారాయణ, చైతన్యలాంటి ప్రైవేట్ విద్యాసంస్థలకు లాభం చేకూరేలా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోంది. పేద విద్యార్థులకు ప్రోత్సాహం కరువైంది.

–బొడ్డపాటి హేమంత్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు

హామీలు నెరవేర్చకుంటే ఉద్యమం ఉధృతం



ఎన్నికలకు ముందు అబద్ధపు హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక విద్యార్థులు, నిరుద్యోగులను పట్టించుకోవడం మానేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందన్న ఆశతో చదువుతున్న పేద విద్యార్థుల ఉన్నత చదువులు మధ్యలోనే నిలిచిపోయాయి. యువత ఆగ్రహం వస్తే రాజ్యాలే కూలిపోయాయి. కూటమి ప్రభుత్వం ఎంత..? యువత హామీలు నెరవేర్చకుంటే రాష్ట్రంలో నిరసనలు పెంచుతాం. ప్రభుత్వం మెడలు వంచుతాం.

– పాలిశెట్టి సురేష్‌రాజ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి

అర్జీలకు పరిష్కారమేదీ?



ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ సామాన్యులకు అక్కరకు రావడం లేదు. పీజీఆర్‌ఎస్‌లో జిల్లా అధికారులను కలిసి కష్టాలు చెప్పుకోవచ్చన్న వారి ఆశలపై నీళ్లు చల్లుతూ సిబ్బంది నిర్దయగా వ్యవహరిస్తున్నారు. సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఎస్.రాయవరం మండలం గుర్రాజుపేట గ్రామానికి చెందిన కొర్ని అప్పలనర్స ఉదంతమే అందుకు ఉదాహరణ. కోర్టులో వ్యాజ్యం నడుస్తుండగానే తల్లిదండ్రుల నుంచి వచ్చిన భూమిని తన సోదరులు వారి పేరున ఆన్‌లైన్ చేసుకొని తనకు అన్యాయం చేశారని ఆమె కలెక్టరేట్‌లో మూడు వారాల క్రితం ఫిర్యాదు చేసింది. తనకు న్యాయం చేయమని అడుగుదామంటే సిబ్బంది అడ్డుకుని బయటకు తరిమేస్తున్నారని ఆమె వాపోయింది.

8లో

న్యూస్‌రీల్

డీఈవోకు ఎంటీఎస్ ఉపాధ్యాయుల వినతి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి టౌన్: ఎంటీఎస్ ఉపాధ్యాయులకు బదిలీల్లో న్యాయం చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పంపాల వెంకటరమణ కోరారు. స్థానిక డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1998, 2008 బ్యాచ్‌లకు చెందిన ఎంటీఎస్ ఉపాధ్యాయులకు బదిలీల్లో మైదాన ప్రాంతాలలో ఖాళీలను చూపించాలని, వారి వయసు రీత్యా ఏజెన్సీలో పనిచేయడం కష్టతరమన్నారు. ఎస్ఎస్‌సీ మూల్యాంకన రుసుంను వెంటనే విడుదల చేయాలన్నారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నక్కా శ్రీనుబాబు, ఉపాధ్యక్షుడు ఎం.వి.లోకేష్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి కుమార్తె అంత్యక్రియలు



తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్న భారతి

బుచ్చెయ్యపేట: తండ్రికి తలకొరివి పెట్టి, కుమార్తె తండ్రి రుణం తీర్చుకుంది. అన్నీ తానై అంత్యక్రియలు నిర్వహించి, కుమారులు లేని లోటును తీర్చింది. వడ్డాది గ్రామానికి చెందిన పిడుగుల నానాజీ (43) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. ఆయనకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారులు లేకపోవడంతో నానాజీ పెద్ద కుమార్తె భారతి తండ్రికి దహన సంస్కారాలు నిర్వహించింది. రెండో కుమార్తె కూడా తన తండ్రి మృతదేహంతో వచ్చి దహన సంస్కారాల్లో పాల్గొంది.

సమాచార శాఖ డీడీగా సదారావు బాధ్యతల స్వీకరణ



మహారాణిపేట: సమాచార పౌర సంబంధాల శాఖ రెగ్యులర్ డిప్యూటీ డైరెక్టర్(డీడీ)గా కె.సదారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు నెల్లూరు డీడీగా సేవలందించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా విశాఖ ఉప సంచాలకులుగా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇన్‌చార్జిగా డీడీగా వ్యవహరించిన డి.రమేశ్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు వి.మణిరామ్‌ను మురళీనగర్‌లోని తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సదారావు నియామకం పట్ల సమాచార శాఖ ఉద్యోగులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

సర్కారు భూ దాహం

- స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ కోసం కొత్తగా 3,265 ఎకరాల సేకరణ
- నేటి నుంచి నాలుగు గ్రామాల్లో సభల నిర్వహణ



అదనంగా భూములు సేకరించేందుకు ఏపీఐఐసీ కలెక్టర్‌కు రాసిన లేఖ

నక్కపల్లి: కూటమి సర్కారుకు భూదాహం తీరడం లేదు. పేదల నుంచి భూములను సేకరించి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ఉత్సాహం చూపిస్తోంది. ఇప్పటికే 6 వేల ఎకరాలు సేకరించిన ఏపీఐఐసీ తాజాగా మరో 3,265 ఎకరాలపై కన్నేసింది. మంగళవారం నుంచి గ్రామ సభలు నిర్వహించి, ప్రజలను ఒప్పించేందుకు సిద్ధపడుతోంది. ఏపీఐఐసీ ద్వారా 2014లో నక్కపల్లి మండలం నుంచి 4500 ఎకరాలు సేకరించి, అందులో 2 వేల ఎకరాలను బల్క్‌డ్రగ్ పార్క్ కోసం కేటాయించిన విషయం తెలిసిందే. మిగిలిన 2500 ఎకరాలను ఈ ఏడాది తెర మీదకు వచ్చిన ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ ఇండియా స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించింది. బల్క్‌డ్రగ్ పార్క్ కోసం ఫేజ్ 2లో భాగంగా మరో వెయ్యి ఎకరాలు సేకరించేందుకు చర్యలు చేపట్టింది. ఎకరాకు రూ.37 లక్షలు చెల్లిస్తామంటూ బేరాలాడుతోంది. ఇది చాలదన్నట్లు తాజాగా స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్ కోసం 3265.94 ఎకరాలు సేకరించేందుకు సిద్ధపడుతోంది.

నాలుగు గ్రామాల నుంచి సేకరించే యోచన

ఏపీఐఐసీ నక్కపల్లి మండలంలోని నాలుగు గ్రామాల నుంచి 3265.94 ఎకరాలు సేకరించాలని యోచిస్తోంది. కాగితలో 225.55 ఎకరాల జిరాయితీ, 81.10 ఎకరాల ప్రభుత్వ భూమి, వేంపాడులో 784.57 ఎకరాల జిరాయితీ, 157.07 ఎకరాల ప్రభుత్వ భూమి, నెల్లిపూడిలో 1337.86 ఎకరాల జిరాయితీ, 242.30 ఎకరాల ప్రభుత్వ భూమి, డీఎల్ పురంలో 392.65 ఎకరాల జిరాయితీ, 44.82 ఎకరాల ప్రభుత్వ భూమి మొత్తం 2740 ఎకరాల జిరాయితీ, 525 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించేందుకు చర్యలు చేపట్టింది. ఈ విషయంపై ఇంతవరకు ఎటువంటి నోటిఫికేషన్ విడుదల చేయకుండా గోప్యంగా ఉంచింది. మంగళవారం నుంచి కొత్తగా భూములు సేకరించే గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే ఈ గ్రామాల్లో సేకరించే భూములకు సంబంధించిన సర్వే నెంబర్లను గుర్తించింది. ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు భూములు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మామిడి, జీడి, అరటి, వరి, వంటి పంటలు పండిస్తూ ఉపాధి పొందుతూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఈ భూములను సేకరించి తమకు అన్యాయం తలపెట్టాలని చూస్తోందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో పెట్టుబడి పెట్టిన పారిశ్రామికవేత్తలకు, కార్పొరేట్ శక్తులకు భూములు పంచడానికే ఈ భూసేకరణ చేస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నోటిఫికేషన్ విడుదల చేస్తారా, లేక నేరుగా రైతుల నుంచే కొనుగోలు చేస్తారా అనేది స్పష్టం చేయడం లేదు. ఏ గ్రామంలో ఏ సర్వే నెంబర్లో ఎంత భూమి సేకరిస్తారో తెలియజేయడం కోసమే మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.



వేంపాడు సమీపంలో ప్రభుత్వం సేకరించనున్న భూములు

గ్రామసభలు అడ్డుకుంటాం



సర్కారుకు భూ దాహం తీరడంలేదు. ఇప్పటికే 6 వేల ఎకరాలు సేకరించారు. మరో 3,265 ఎకరాలు సేకరించేందుకు సిద్ధపడుతున్నారు. నేలతల్లిని నమ్ముకుని జీవిస్తున్న రైతులకు అన్యాయం చేయాలని కూటమి సర్కారు కుట్ర పన్నుతోంది. ఓట్లేసి గెలిపించిన రైతుల కంటే ఎన్నికల్లో పెట్టుబడులు పెట్టిన పారిశ్రామికవేత్తల ప్రయోజనాలే ప్రధానమని ప్రభుత్వం భావిస్తోంది, మంగళవారం నుంచి జరిగే గ్రామసభలను అడ్డుకుంటాం. రైతులను చైతన్యపరచి భూములు ఇచ్చే ప్రసక్తి లేదని ప్రభుత్వానికి చెప్పిస్తాం. భూములు, నివాస ప్రాంతాలు లాక్కుంటే ఈ ప్రాంత ప్రజలు ఎక్కడ జీవిస్తారు. గతంలో భూమిలిచ్చిన నిర్వాసితులకే ఇప్పటి వరకు పునరావాసం కల్పించలేదు. సరైన ప్యాకేజీ ఇవ్వలేదు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కూడా ఇవ్వలేదు. ఈ విషయాలను రైతులకు వివరించి భూసేకరణ అడ్డుకుంటాం.

–వీసం రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నేత

కళాకారులు చైతన్య దీపికలు

అనకాపల్లి: ప్రజానాట్య మండలి జిల్లా గౌరవాధ్యక్షునిగా రాజాన దొరబాబు, అధ్యక్షునిగా మర్రి రాజునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా గొర్లె దేముడుబాబు, సహాయ కార్యదర్శులుగా కె.వి.రమణ, కొండబాబు, పొంతపల్లి రామారావు, వియ్యపు రాజు, బాబ్జీ, విత్తనాల పోతురాజు ఎన్నికయ్యారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, జిల్లా నాయకులు జి.గురుబాబు, వైఎస్ భద్రం, కోరుపల్లి శంకరరావు, ఫణీంద్ర సత్యనారాయణ పాల్గొన్నారు.

లంకెలపాలెం జంక్షన్‌లో ఘోర ప్రమాదం

ముగ్గురి మృతి.. ఏడుగురికి తీవ్ర గాయాలు



సంఘటన స్థలంలో మృతదేహాలు



కొణతాల అచ్చన్నాయుడు, పచ్చికూర గాంధీ (ఫైల్)

పరవాడ/అనకాపల్లి టౌన్ : లంకెలపాలెం ప్రధాన జంక్షన్‌లో సోమవారం రాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాజువాక నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న మార్కెట్ లారీ బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో ఈ ప్రమాదం జరిగింది. ఫార్మాసిటీలో విధులు ముగించుకుని వస్తున్న ఉద్యోగుల కారును ఢీకొనగా అందులో ఉన్న ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. అనంతరం ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనగా.. దానిపై ప్రయాణిస్తున్న ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రగాయాలపాలయ్యాడు. తరువాత బొలేరా వాహనం , కంటైనర్, మరో రెండు ద్విచక్రవాహనాలను ఢీకొనగా నలుగురు గాయపడ్డారు. మృతుల్లో అనకాపల్లికి చెందిన కొణతాల అచ్చన్నాయుడు (52), అనకాపల్లి మండలం రేబాకకు చెందిన పచ్చికూర గాంధీ (47), అగనంపూడికి చెందిన ఫార్మా ఉద్యోగి ఎర్రప్పడు (35) ఉన్నారు. మృతదేహాలను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రుల్లో చేర్పించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు వైద్యులు తెలిపారు. క్షతగాత్రుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది.

క్లుప్తంగా

మట్టి అక్రమ రవాణా.. 4 ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ట్రాక్టర్లు

గొలుగొండ: చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి తరలిస్తుండగా 4 వాహనాలను పట్టుకున్నామని కృష్ణదేవిపేట ఎస్‌ఐ తారకేశ్వరరావు తెలిపారు. మండలంలో ఏఎల్ పురం గ్రామపరిధిలో గల బోయినవారి చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి తరలిస్తున్నట్టుగా వచ్చిన సమాచారంతో దాడి చేశామన్నారు. సంఘటన స్థలంలో నాలుగు వాహనాలు పట్టుబడగా వాటిని స్టేషన్‌కు తరలించామన్నారు, తదుపరి చర్యల నిమిత్తం గొలుగొండ తహసీల్దార్ కార్యాలయానికి సోమవారం నివేదిక ద్వారా పంపించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రాజ్‌కుమార్ మృతదేహం

కోటవురట్ల: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాలు ఇవి. రాట్నాలపాలేనికి చెందిన కాలాబత్తుల రాజ్‌కుమార్(56) ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డులోని ఓ హోటల్‌లో చెఫ్‌గా పనిచేస్తున్నాడు. హోటల్‌లో పని ముగించుకుని ఆదివారం రాత్రి కోటవురట్లకు వస్తుండగా రామచంద్రపురం జంక్షన్ దాటాక పైలట్ ప్రాజెక్టు వద్ద ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అతనిని అంబులెన్సులో విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

క్రైస్తవ వివాహాల లైసెన్స్ జారీ కర్తగా వెంకటరమణ



దేవరాపల్లి: క్రైస్తవ వివాహాల నిర్వహణ, వివాహ ధ్రువీకరణ పత్రాలను జారీ చేసేందుకు లైసెన్స్ కర్తలను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అనకాపల్లి జిల్లా నుంచి దేవరాపల్లిలోని దైవ స్వరూపి చర్చి పాస్టర్ పలివిలి వెంకటరమణ (నతానియేలు)కు క్రైస్తవ వివాహాల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించింది. పది సంవత్సరాల పాటు వివాహ లైసెన్స్‌లు జారీ చేసేందుకు కాల పరిమితి విధిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలోని పశ్చిమగోదావరి, అనంతపురం, కర్నూలు, ఏలూరు జిల్లాల నుంచి ఒక్కొక్కరికీ, గుంటూరు జిల్లా నుంచి ముగ్గురు పాస్టర్లకు క్రైస్తవ వివాహాల లైసెన్సుల జారీకర్తలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అర్జున్ పరిశ్రమలో ప్రమాదం

పరవాడ : జేఎస్ ఫార్మాసిటీలోని ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్‌ఈజెడ్) ప్రాంగణంలో ఉన్న అర్జున్ ఫార్మా పరిశ్రమలో సోమవారం తెల్లవారుజామున రసాయనం లీకై ఇద్దరు కార్మికులు స్వల్పంగా గాయపడ్డారు. పరవాడ సీఐ ఆర్. మల్లికార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ప్రమాదంలో పరిశ్రమ ఉద్యోగి తులసి (పరవాడ మండలం, దలాయిపాలెం), కాంట్రాక్టు కార్మికుడు జగదీష్ (గాజువాక) గాయపడ్డారు. రియాక్టర్ల వద్ద పైపులైన్ మరమ్మతులు చేస్తుండగా, పొటాషియం హైడ్రాక్సైడ్ అనే రసాయనం పైపు నుంచి లీకై వారి ముఖాలపై పడింది. వెంటనే వారిద్దరినీ నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

పీజీఆర్‌ఎస్ అర్జీలకు పరిష్కారమేదీ..!



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో సత్యనారాయణ

తుమ్మపాల: ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఇచ్చే అర్జీల పట్ల అధికారులు చూపుతున్న నిర్లక్ష్యానికి ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ వేదిక బయట పలువురు వృద్ధులు సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశారు. పీజీఆర్ఎస్ అర్జీలపై పరిష్కారం చూపకుండా పొంతన లేని సమాధానాలతో అధికారులు ముగించేస్తున్నారని, కొన్నింటికి కనీసం అర్జీదారులను కూడా సంప్రదించడం లేదని చెబుతున్నారు.

భూవివాదంపై ఫిర్యాదుకు స్పందన లేదు...

కోర్టులో ఉన్న భూమికి సోదరులు వారి పేరున ఆన్‌లైన్ చేసుకుని అన్యాయం చేయడంపై ఈ నెల 2న కలెక్టరేట్‌లో ఇచ్చిన ఫిర్యాదుకు నేటికీ స్పందన లేదని, అధికారులను అడుగుదామంటే సిబ్బంది అడ్డుకుని బయటకు తరిమేస్తున్నారని ఎస్.రాయవరం మండలం గుర్రాజుపేట గ్రామానికి చెందిన కొర్ని అప్పలనర్స సోమవారం పీజీఆర్ఎస్ వేదిక వద్ద సిబ్బందిపై అసహనం వ్యక్తం చేసింది. తల్లిదండ్రులిచ్చిన భూమికి తన పేరున పత్రాలు లేవని, ఎమ్మార్వోకి డబ్బులిచ్చి వారి పేరున నమోదు చేయించుకుని అన్నదమ్ములు భూమిని లాక్కుంటున్నారని ఆమె రోధించింది. తన తల్లి మరణించడంతో తనకీ కష్టాలు వచ్చాయని, తన తల్లి మరణ ధ్రువీకరణ పత్రం కూడా తనకు ఇవ్వకుండా సోదరులు ఇబ్బందులు పెడుతున్నారని తెలిపింది. దీనిపై 20 రోజుల క్రితం కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదు అందించినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయింది. అధికారులు తన మొర ఆలకించి గ్రామంలో విచారణ చేసి తనకు న్యాయం చేయాలని ఆమె కోరింది.

మత్స్యకార రైతులకు న్యాయం చేయాలి

విశాఖ, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు సేకరిస్తున్న శ్రీ కనకమహాలక్ష్మి సాగర మత్స్యపారిశ్రామిక సహకార సంఘం భూములకు నష్టపరిహారం మంజూరు చేసి నిరుపేద మత్స్యకార రైతులకు న్యాయం చేయాలని సంఘ రైతులు పీజీఆర్ఎస్‌లో డీఆర్వోకు విన్నవించారు. 1994లో నక్కపల్లి మండలం వేంపాడులో 44 ఎకరాల భూమిని ప్రభుత్వం రైతులకు లీజుకిచ్చిందని, వాటినే నమ్ముకుని జీవిస్తున్నామని ఇప్పుడు భూములు సేకరించినప్పటికీ నష్టపరిహారం మంజూరు విషయంలో అధికారులు స్పష్టత ఇవ్వడం లేదని, సొసైటీ భూములకు కూడా నష్టపరిహారం మంజూరు చేసి న్యాయం చేయాలని కోరారు.

256 దరఖాస్తుల స్వీకరణ

సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, పీజీఆర్ఎస్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రమామణి, జిల్లా సర్వే, భూ రికార్డుల సహాయ సంచాలకుడు గోపాలరాజు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా నివారించాలన్నారు. మొత్తం 256 అర్జీలు నమోదు కాగా రెవెన్యూ 125, సర్వే సెటిల్‌మెంట్ 21, పాఠశాల విద్య 17, పంచాయతీరాజ్ 13, విద్యుత్ శాఖ 12, పోలీస్ 10, మిగిలినవి వివిధ శాఖల్లో నమోదయ్యాయి. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలాజీ, జిల్లా పంచాయతీ అధికారి సందీప్, జిల్లా విద్యాశాఖ అధికారి జి.అప్పారావు నాయుడు, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుధీర పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులూ ఇదేం తీరు...?



నారపిన్ని తాతారావు

నాగార్జున సిమెంట్ ఫ్యాక్టరీకి విద్యుత్ లైన్ ఏర్పాటులో భాగంగా విద్యుత్ శాఖ సిబ్బంది తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా మా భూమి మధ్యలోంచి విద్యుత్ స్తంభాలు వేసి ఇల్లు కట్టుకోకుండా చేసారని, తక్షణమే తొలగించి మాకు న్యాయం చేయాలంటు కశింకోట మండలం నర్సింగబిల్లి గ్రామానికి చెందిన నారపిన్ని తాతారావు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. తమకు కేవలం 20 సెంట్ల భూమి మాత్రమే ఉందని, అందులో వారం రోజుల క్రితం తమకు తెలియకుండా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేసారని, విద్యుత్ సిబ్బందిని అడిగితే ఇప్పుడు తొలగించడం కుదరదంటున్నారని, ఇల్లు కట్టుకుందామనుకున్న లోపే ఇలా స్తంభాలు వేసి తీవ్ర అన్యాయం చేస్తున్నారని, తక్షణమే విద్యుత్ స్తంభాలు తొలగించాలని కోరారు.

ఎస్పీ కార్యాలయంలో 30 అర్జీలు



అర్జీదారుల సమస్యలు వింటున్న అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కార వేదికకు సోమవారం 30 అర్జీలు వచ్చాయి. జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు అర్జీదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటే అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, మోసపూరిత హామీలపై అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ డి.వెంకన్న పాల్గొన్నారు.

భుక్తి లేకుండా చేశారు..



కొలుసు లక్ష్మి

20 ఏళ్లుగా రాయుడుపేట ప్రభుత్వ పాఠశాలలో వంట చేస్తున్న తనను అర్ధంతరంగా తొలగించి కూటమి పార్టీ మహిళకు అప్పగించారని, తనకు జీవనాధారం చూపించాలని అనకాపల్లి మండలం శంకరం గ్రామానికి చెందిన కొలుసు లక్ష్మి పీజీఆర్ఎస్‌లో విన్నవించింది. పాఠశాలలో వంట పనే జీవనాధారం చేసుకుని జీవిస్తున్నానని పేర్కొంది. పాఠశాలకు ఇద్దరు పిల్లలే రావడంతో ఒక రోజు మాత్రమే ఇంటి దగ్గరే వంట చేసి తీసుకొచ్చానని, ఉపాధ్యాయులు హెచ్చరించడంతో తరువాత నుంచి పాఠశాలలోనే వంట చేస్తున్నప్పటికీ తనపై రాజకీయ ముసుగు పులిమి తొలగించారని, తన పని తనకు ఇప్పించి ఆదుకోవాలని ఆమె కోరింది.

మత్స్యకారుల సమస్యలపై కలెక్టర్‌కి వినతి



కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకార నాయకులు

అచ్యుతాపురం రూరల్: పూడిమడక మత్స్యకార ప్రజల సమస్యలు పరిష్కారం చేయాలంటూ సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ వాసుపల్లి పద్మ శ్రీనివాస్, చేపల శ్రీరాములు విన్నవించారు. సరైన వసతి, మౌలిక సదుపాయాలు కూడా లేని దుస్థితిలో సుమారు 20 వేల పైబడి జనాభా ఉన్న పూడిమడక మత్స్యకారులు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురౌతున్నారన్నారు. గత ప్రభుత్వంలో అన్ని సౌకర్యాలతో పూడిమడక తుపాను బిల్డింగ్‌లో ఏషియన్ పెయింట్స్ సహకారంతో వైద్య సేవలు అందేవన్నారు. పీహెచ్‌సీ, హోమియోపతి ఆస్పత్రులు ఉండేవని, కానీ ఇప్పుడు ఆ సేవలు నిలిపివేశారని తెలిపారు. తక్షణమే అధికారులు చర్యలు చేపట్టి పీహెచ్‌సీ, హోమియోపతి ఆసుపత్రి తెరిపించి ఆరోగ్య సేవలు అందించాలని కోరారు. అలాగే గత ప్రభుత్వంలో మత్స్యకారుల కోసం తలపెట్టిన ఫిషింగ్ హార్బర్ పనులు కూడా నిలిపివేశారని, వెంటనే హార్బర్ పనులు చేపట్టి మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడాలని కోరారు.

యువతను నట్టేట ముంచిన కూటమి సర్కార్

- ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా వంచన
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈర్లె అనురాధ విమర్శ



దేవరాపల్లి: రాష్ట్రంలో యువతను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచిందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈర్లె అనురాధ విమర్శించారు. తారువలో సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలు కల్పిస్తామని, లేకుంటే నెలకు రూ. 3 వేలు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చిన కూటమి సర్కార్ ఏడాది గడిచినా అమలు చేయకుండా యువతను మోసగించారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రభుత్వంపై యువత తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద 'యువత పోరు' పేరిట చేపట్టిన నిరసన కార్యక్రమానికి అధిక సంఖ్యలో యువత తరలిరావడమే ఇందుకు నిదర్శనమన్నారు. 2014 ఎన్నికల్లోను ఇదే మాదిరిగా హామీలిచ్చి చంద్రబాబు యువతను మోసగించారని ఆమె ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా ఉద్యోగాలు ఇవ్వక పోగా ఉన్న ఉద్యోగాలను తీసేస్తున్నారని మండిపడ్డారు. మోసపూరిత వాగ్దానాలతో వంచించిన కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆమె స్పష్టం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వైద్య ఆరోగ్యశాఖలో నర్సుల అక్రమ బదిలీలు

- గడువు ముగిసినా ఆగని స్థానచలనం
- వెనుక తేదీతో అడ్డగోలు వ్యవహారం

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలో నర్సుల బదిలీల గడువు ఈ నెల 19తో ముగిసినప్పటికీ, ఆ తర్వాత కూడా వెనుక తేదీలతో అక్రమ బదిలీలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత రెండు రోజుల్లో పలువురు స్టాఫ్ నర్సులకు బదిలీ, పోస్టింగ్ ఉత్తర్వులు జారీ అయినట్లు తెలుస్తోంది. చెస్ట్ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఆరుగురు నర్సులను బదిలీ చేయగా, సూపరింటెండెంట్ వారిని రిలీవ్ చేయడానికి నిరాకరించారు. నర్సులు లేకుండా ఎలా విధులు నిర్వర్తించాలని ప్రశ్నిస్తూ, బదిలీ అయిన వారి స్థానంలో కొత్తవారిని నియమించాలని డిమాండ్ చేశారు. దీంతో కేజీహెచ్‌లోని ఆరుగురు నర్సులను టీబీ ఆస్పత్రికి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మానసిక దివ్యాంగులైన పిల్లలున్న ఒక తల్లిని కేజీహెచ్ నుంచి ఆంధ్ర మెడికల్ కాలేజీకి బదిలీ చేయగా, ఇప్పుడు ఆమెకు ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో పోస్టింగ్ ఇచ్చారు. కేజీహెచ్‌లోని మరో ఇద్దరు నర్సులకు ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో పోస్టింగ్‌లు లభించాయి. 55 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న 19 మంది నర్సులను అల్లూరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకు బదిలీ చేశారు. అయితే వీరిలో ఎవరూ విధుల్లో చేరలేదు. వారంతా కోర్టును ఆశ్రయించేందుకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం.

ట్రాలీ లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- బయ్యవరం వద్ద ప్రమాదం
- బస్సు డ్రైవర్‌తో సహా 8 మందికి గాయాలు



అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న సీఐ స్వామినాయుడు



బయ్యవరం వద్ద ప్రమాదానికి గురైన నర్సీపట్నం డిపో ఆర్టీసీ లగ్జరీ బస్సు

కశింకోట: మండలంలో బయ్యవరం వద్ద సోమవారం ఆర్టీసీ లగ్జరీ బస్సు ప్రమాదానికి గురి కావడంతో డ్రైవర్ సహా 8 మంది గాయపడ్డారు. సీఐ అల్లు స్వామినాయుడు అందించిన వివరాల ప్రకారం...నర్సీపట్నం నుంచి విశాఖ వెళుతున్న నర్సీపట్నం డిపో ఆర్టీసీ లగ్జరీ బస్సు బయ్యవరం సరోజిని పరిశ్రమ వద్ద ముందు వెళుతున్న ట్రాలీ లారీని బలంగా ఢీకొట్టింది. ట్రాలీ డైవర్ ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా ఎడమ వైపునకు మలుపు తిప్పుతుండగా బస్సు వేగంగా వచ్చి ట్రాలీని ఢీకొట్టింది. దీంతో బస్సు డ్రైవర్ కె. కల్యాణ్‌కుమార్ సహా కొప్పిశెట్టి సత్యనారాయణ, గెద్దం పద్మ, నమ్మి రాజ్‌కుమార్, పసుపులేటి ప్రభాకర్, మాకిరెడ్డి రామలక్ష్మి, పి.గంగాధర్, మాకిరెడ్డి నారాయణమూర్తి గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. వీరితో పాటు మరికొందరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వేరే బస్సులో తమ గమ్యాలకు తరలి వెళ్లారు. ప్రయాణికుడు మాకిరెడ్డి నారాయణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాలీ, ఆర్టీసీ డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. బస్సులో 34 మంది ప్రయాణికులు ఉన్నారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ ఎం. శ్రావణి సందర్శించారు. బస్సు రోడ్డుపై నిలిచిపోవడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. క్రేన్ సహాయంతో బస్సును అడ్డు తొలగించి ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు. అనకాపల్లిలో చికిత్స పొందుతున్న రోగులను సీఐ పరామర్శించారు. ప్రయాణికులు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంలో బస్సు ముందు భాగం దెబ్బతింది.

సచివాలయ విద్యుత్ కార్మికుల నిరసన



విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న సచివాలయం ఉద్యోగులు

అనకాపల్లి: గ్రామ/వార్డు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎనర్జీ అసిస్టెంట్, జూనియర్ లైన్‌మాన్ గ్రేడ్-2 ప్రతిపాదిత బదిలీలు, రేషనలైజేషన్‌కు ప్రభుత్వం ప్రత్యేక జీవో విడుదల చేయడం అన్యాయమని, దీనిని తక్షణమే నిలుపుదల చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్యారావు అన్నారు. స్థానిక గవరపాలెం నిదానందొడ్డి విద్యుత్‌శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్‌లకు సంబంధించిన ప్రత్యేకమైన పని విధానం, 24 గంటలు అందుబాటులో ఉండి అత్యవసర పరిస్థితుల్లో సచివాలయం ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ, రీజనల్ అధ్యక్షుడు ప్రేమ చంద్రశేఖర్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.శ్రీనివాసరావు, కె.మాధవి, కె.నాగ అప్పారావు, జేఎల్ఎం గ్రేడ్-2 నాయకులు అప్పలరాజు, శంకర్, అక్కునాయుడు, గంగాధర్, చంద్రరావు పాల్గొన్నారు.

డబ్ల్యూఎస్ఎం ఏఈపై శాఖాపరమైన విచారణ

విచారణ అధికారిగా ఈఈ త్రినాథం

చోడవరం: ఏసీబీ కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఇరిగేషన్ శాఖ (డబ్ల్యూఎస్ఎం) విభాగం వడ్డాది సెక్షన్ ఏఈగా పనిచేసిన ఆకుల ప్రకాష్‌పై శాఖా పరమైన విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. విచారణ అధికారిగా చోడవరం డబ్ల్యూఎస్ఎం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.త్రినాథంను నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి. సాయిప్రసాద్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. 2018లో చోడవరం సబ్ డివిజన్ పరిధిలో వడ్డాది సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఆకుల ప్రకాష్ పనిచేశారు. అప్పట్లో అవినీతికి పాల్పడ్డారంటూ కొందరు రైతులు అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ)కి ఫిర్యాదు చేయడం, లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకోవడం జరిగింది. దీనిపై ఏసీబీ విచారణ జరుగుతుండగా ఇప్పుడు శాఖా పరమైన విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు విచారణ అధికారిగా ఈఈ త్రినాథంను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

కాలుష్యంలో కలిసిన లక్ష్యం

- కాలుష్య నియంత్రణకు కూటమి మేయర్ మంగళం
- సెల్లార్‌లో ఉద్యోగులు..సిబ్బంది ద్విచక్ర వాహనాలు
- గత మేయర్ ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణకు చర్యలు



సెల్లార్‌లో యథావిధిగా ఉద్యోగులు, సిబ్బంది ద్విచక్రవాహనాలు

డాబాగార్డెన్స్: కాలుష్య రహిత నగరంగా విశాఖను మార్చాలనే సంకల్పంతో మాజీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి చేపట్టిన కార్యక్రమానికి ప్రస్తుత కూటమి మేయర్ పీలా శ్రీనివాసరావు మంగళం పాడారు. గతంలో ప్రతి సోమవారం వ్యక్తిగత వాహనాలను వదిలి, ప్రజా రవాణాను ఉపయోగించడం ద్వారా కాలుష్య నియంత్రణకు ఆమె ప్రయత్నించారు. దీనికి జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు కొంతమేర సహకరించేవారు. అయితే అవిశ్వాస తీర్మానం ద్వారా గత మేయర్‌ను గద్దె దించిన కూటమి కార్పొరేటర్లు, కాలుష్య నియంత్రణపై ఆమె తీసుకున్న నిర్ణయాలను విస్మరించారు. కూటమి మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావు ప్రతి సోమవారం వ్యక్తిగత వాహనంలోనే జీవీఎంసీకి వస్తున్నారు. కేవలం మేయర్ మాత్రమే కాకుండా, జీవీఎంసీ ఉద్యోగులు, సిబ్బంది కూడా ఇదే మార్గాన్ని అనుసరిస్తున్నారు. గతంలో జీవీఎంసీ ప్రధాన ద్వారం వరకు మాత్రమే వాహనాల్లో వచ్చిన అధికారులు, ఇప్పుడు నేరుగా కార్యాలయం లోపలికి వాహనాలను తీసుకువస్తున్నారు. గత మేయర్ హరి వెంకట కుమారి కాలుష్య నియంత్రణకు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను లేదా సైకిళ్లను ఉపయోగించడం ద్వారా కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ఆమె నగర ప్రజలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలకు వివరించారు. కానీ ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే కాలుష్య నియంత్రణకు చేపట్టిన ప్రయత్నాలకు అడ్డుకట్ట పడినట్లు కనిపిస్తోంది.

కాలుష్య నియంత్రణకు కృషి చేశా



నగరంలో విపరీతంగా పెరిగిపోతున్న కాలుష్య నియంత్రణకు..నగర మేయర్(నాలుగేళ్ల పాటు)గా..నగర పౌరురాలిగా తన వంతు కృషి చేశా. ప్రజల్లో అవగాహన పెంచాం. కాలుష్య నియంత్రణకు ప్రజల్ని భాగస్వాముల్ని చేశాం. ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం. కాలుష్య నియంత్రణ గాడిన పడతున్న సమయంలో కూటమి మేయర్ మంగళం పాడడం బాధాకరం. అధికారులు,ఉద్యోగులు,సిబ్బంది కూడా కాలుష్య నియంత్రణ గాలికొదిలేయడం బాధాకరం. **–గొలగాని హరి వెంకటకుమారి, మాజీ మేయర్,**

పాము కాటుతో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ క్వార్టర్‌లో నిద్రిస్తున్న ఉద్యోగిని పాము కాటు వేయడంతో మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ విభాగం జనరల్ ఫోర్‌మెన్ తగరంపూడి శ్రీనివాస్(59) టౌన్‌షిప్‌లో సెక్టార్-11 గ్రౌండ్ క్వార్టర్‌లో కుటుంబంతో నివసిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఆయన హాల్లో పడుకున్నాడు. తెల్లవారు సమయంలో పాము కుట్టినట్టు తెలిసింది. నిద్రిస్తున్న కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టకూడదని ఆయన ఒక్కరే ఉక్కు జనరల్ ఆస్పత్రిలోని క్యాజువాల్టీకి వెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి నగరంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని ఉక్కు ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. స్నేక్ క్యాచర్ కిరణ్ మార్చురీలోని మృతదేహాన్ని పరిశీలించి పాము కాటు అని నిర్ధారించారు. శ్రీనివాస్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లలిద్దరు విదేశాల్లో ఉన్నారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు పలు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

మద్దిలపాలెం : ఏయూ మోడల్ కెరీర్ సెంటర్‌లో పలు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీకి ఈనెల 25వ తేదీ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని సెంటర్ డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు పేర్కొన్నారు. యోకోమా కంపెనీలో ప్రొడక్షన్ విభాగంలో 100 ఖాళీలు ఉన్నాయని, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పాసైన 25 ఏళ్లలోపు మహిళలు అర్హులని పేర్కొన్నారు. వేతనం రూ.12-రూ.15 వేలు ఉంటుందన్నారు. డబ్ల్యూఎన్ఎస్‌లో 50 ఖాళీలున్నాయని, డిగ్రీ పాసైన 26 ఏళ్లలోపు వారు అర్హులని వేతనం రూ.15 వేలు ఉంటుందన్నారు. ఆప్టివల్ హెల్త్ సొల్యూషన్‌లో 120 ఖాళీలున్నాయని, 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు గల 18-26 ఏళ్లలోపువారు అర్హులని, వేతనం రూ.11-రూ.25 వేలు ఇస్తారని తెలిపారు. హెల్త్‌కేర్‌లో బీసీజీ, స్టాఫ్‌నర్సు ఖాళీలు 50 ఉన్నాయని, ఎంపీహెచ్ఏ (ఎఫ్), బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం పూర్తిచేసినవారు అర్హులని, వేతనం నెలకు రూ.12-రూ.35 వేలు ఉంటుందన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించండి

మహారాణిపేట: జర్నలిస్టుల పిల్లలకు గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా విద్యాసంస్థల్లో ఫీజు రాయితీ కల్పించాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్‌కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) భవానీ శంకర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లో ఇప్పటికే జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీపై ఉత్తర్వులు జారీ అయ్యాయని, విశాఖ జిల్లాలోనూ వంద శాతం రాయితీ కల్పించాలని జర్నలిస్టు నాయకులు గంట్ల శ్రీనుబాబు, పి.నారాయణ్‌లు డీఆర్వోను కోరారు. గతంలో కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ కొన్ని పాఠశాలలు ఫీజు రాయితీని నిరాకరించాయని తెలిపారు. జర్నలిస్టుల వినతిపై డీఆర్వో సానుకూలంగా స్పందించి, డీఈవో ప్రేమ కుమార్‌ను పిలిచి ఉత్తర్వులు పరిశీలించి తక్షణమే కలెక్టర్‌కు ఫైల్ పంపాలని ఆదేశించారు. అలాగే జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షల విషయం కలెక్టర్ దృష్టిలో ఉందని, త్వరలో చర్యలు తీసుకుంటారని డీఆర్వో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ బ్రాడ్‌కాస్ట్ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఇరోతి ఈశ్వరరావు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

బడిఈడు పిల్లలను చేర్పించాలి



తల్లిదండ్రులను కలిసి అభ్యర్థిస్తున్న ఉపాధ్యాయులు సుజాత, లక్ష్మి

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి హైస్కూలు ఉపాధ్యాయ బృందం సోమవారం ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా పర్యటించి బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరింది. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత భోజనం, పుస్తకాలు, యూనిఫాం పంపిణీ వగైరా కల్పిస్తున్న సదుపాయాల గురించి ఉపాధ్యాయులు బి.వి. లక్ష్మి, సుజాత వివరించారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను హైస్కూలులో చేర్పించడానికి సమ్మతి తెలిపారని వారు పేర్కొన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం కూరగాయల ధరలు స్థిరంగా ఉన్నాయి. కిలో టమాటా రూ.20, ఉల్లి రూ.30, బెండకాయ, వంకాయ రూ.40, దొండకాయ రూ.50, బీట్‌రూట్, క్యారెట్ రూ.60, గోరుచిక్కుడు, బీరకాయ రూ.80, పొదుచిక్కుడు రూ.120కి అమ్మకాలు సాగాయి.

ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థినుల ఎంపిక

కశింకోట: స్థానిక బాలికల హైస్కూలు నుంచి ఇద్దరు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం ఎంపిక జాబితా విడుదల అయింది. ఈ ఏడాది టెన్త్ పరీక్షల్లో 600 లకు 579 మార్కులు పొందిన మలిరెడ్డి గౌరి, 578 మార్కులు పొందిన భరిణికాన దీపిక శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపిక అయ్యారని హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి తెలిపారు. వచ్చే నెల 2, 3 తేదీల్లో నూజివీడులో జరిగే ఇంటర్వ్యూలకు హాజరవుతారన్నారు. వారికి హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయ సిబ్బంది, విద్యా కమిటీ చైర్మన్ ఆళ్ల శ్రీనివాసరావు తదితరులు అభినందనలు తెలిపారు.

గురుకులంలో మిగులు సీట్లకు 25న ప్రవేశ పరీక్ష

నర్సీపట్నం : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6,7,8,9 తరగతుల్లో మిగులు సీట్లకు ఈ నెల 25న తాళ్లపాలెం గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని నర్సీపట్నం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.రాజేశ్వరి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న బాలికలకు తాళ్లపాలెం గురుకులంలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారన్నారు. 6,7 తరగతులకు ఉదయం 10 గంటల నుంచి 11 గంటలు, 8,9 తరగతులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టిక్కెట్, ఆధార్ కార్డులు పట్టుకొని హాజరు కావాలని సూచించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 59 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	------	------
రెండో రకం	3,600	3,700
మూడో రకం	3,400	3,660

అనకాపల్లి సినిమాలు

రాజా	: భైరవం
సత్యనారాయణ స్క్రీన్-1: డ్రాగన్	
సత్యనారాయణ స్క్రీన్-2:8 వసంతాలు	
పర్తిసాయి	:కుబేర
షిర్డీసాయి	: సితారే జమీన్ పర్
వెంకటేశ్వర	:పాప
శ్రీ సత్య	: కట్టప్ప జడ్జిమెంట్
రామచంద్ర	: హంటర్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 50 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 13 యూనిట్లు, బీ పాజిటివ్ -14, ఓ పాజిటివ్ -14, ఏబీ పాజిటివ్ -4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్(9703619706)ను ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 347 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 314 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

మోడల్ స్కూళ్లు



ఆట స్థలం లేని జార్జి స్కూల్

- వసతులు కల్పించకుండానే 19 పాఠశాలల ఎంపిక
- అరకొరగా ఉపాధ్యాయులు
- చాలీచాలని తరగతి గదులు
- పూర్తిస్థాయిలో సరఫరా కాని విద్యార్థి మిత్ర కిట్లు
- విద్యార్థులకు తప్పని తిప్పలు

అనకాపల్లి టౌన్: సీఎం చంద్రబాబు సర్కారు మరోమారు ఆర్భాటం ప్రదర్శించింది. కనీస వసతులు కల్పించకుండానే ఈ విద్యా సంవత్సరం అనకాపల్లి పట్టణం మండలంలో 19 ఆదర్శ(మోడల్) పాఠశాలలను ఎంపిక చేసింది. చాలీచాలని తరగతి గదులు, అరకొరగా ఉపాధ్యాయులు, కనీసం డిజిటల్ బోర్డులు, ల్యాబ్ వంటి సౌకర్యాలు లేవు. ఇవేవీ కల్పించకుండానే ఉత్తమ ఫలితాలు ఎలా సాధ్యమవుతాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పట్టణంలో గాంధీనగరం, వుడ్‌పేట, నిదానందొడ్డి, గవరపాలెం, టౌన్ ప్రైమరీ స్కూల్, జార్జి స్కూల్, మండలం పరిధిలో కుంచంగి, రామాపురం, బవులవాడ, సిరసపల్లి, ముత్రాస్ కాలనీ, డీబీకాలనీ, తుమ్మపాల-1, కేఆర్ కాలనీ, కొత్తూరు ఎన్, కొప్పాక ఇలా 19 పాఠశాలలు మోడల్ స్కూళ్లగా ఎంపికయ్యాయి. వీటిలో ఏ ఒక్క పాఠశాలలోనూ స్థాయికి తగ్గ సౌకర్యాలు లేవు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ప్రతీ తరగతికి విధిగా ఒక్కో టీచర్‌ను నియమించాలి. ఆధునిక బోధన పద్ధతులకు అనుగుణంగా గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి. తద్వారా విద్యార్థులు తమకు కావల్సిన పుస్తకాలను చదువుకోవడానికి వీలు ఉంటుంది. డిజిటల్ బోర్డులు, ల్యాబ్‌లు, పారిశుధ్య సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. ఇవేవి ఎక్కడా లేవు.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

కొన్ని పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేవు. విద్యార్థులు శారీరకంగా చరుకుగా ఉండటానికి మైదానాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇటువంటి సౌకర్యాలు ఏవీ ఏర్పాటు చేయకుండా కేవలం మోడల్ స్కూల్ మంజూరు చేస్తున్నామని ప్రకటించేశారు. క్షేత్ర స్థాయిలో పాఠశాలలను పరిశీలిస్తే ఎక్కడా కనీస వసతులు లేవు. ఇంగ్లిష్, తెలుగు, గణితం, సైన్స్, ఈవీఎస్ ఇలా ఐదు సబ్జెక్టులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉండాలి. ఏ పాఠశాలలోనూ ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున లేరు. కొన్ని పాఠశాలల్లో నలుగురు, మరి కొన్ని పాఠశాలల్లో ముగ్గురు, ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులు మాత్రమే బోధన చేస్తున్నారు. విద్యార్థులకు తరగతుల వారీగా సరిపడా తరగతి గదులు లేవు. నిదానందొడ్డి పాఠశాలలో పాడైపోయిన బోరు దర్శనమిస్తోంది. గత ఏడాది పాఠశాల ప్రారంభానికే పుస్తకాలు, యూనిఫాం, షూస్, బెల్ట్‌లు వంటివి విద్యార్థులకు అందించినా ఈ ఏడాది అరకొరగా పుస్తకాలు మాత్రమే సరఫరా చేశారు. దీనివల్ల పుస్తకాలు అందని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది ఇండెంట్ ప్రకారం మాత్రమే పుస్తకాలు సరఫరా అయ్యాయని ఈ ఏడాది నూతనంగా వచ్చిన అడ్మిషన్లకు ఇంకా పుస్తకాలు అందలేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా ప్రతీ పాఠశాలలో ఫస్ట్ ఎయిడ్ కిట్ ఏర్పాటు చేయాలి. అటువంటివి ఎక్కడా పాఠశాలలో కానరాలేదు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించకుండా ప్రచార ఆర్భాటంతో మోడల్ స్కూళ్లను ప్రకటించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



నిదానందొడ్డి స్కూల్లో పాడైపోయిన మంచినీటి బోరు



ప్రభుత్వ పాఠశాలలో యూనిఫాం లేకుండా విద్యార్థులు

వసతుల కల్పనకు కృషి

మోడల్ స్కూళ్లలో తగినని వసతులు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నాం. పూర్తిస్థాయిలో యూనిఫాం, షూస్ వచ్చిన తర్వాత విద్యార్థులకు పంపిణీ చేస్తాం. బదిలీ అయిన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో ఇంకా బాధ్యతలు చేపట్టడం లేదు.

-ఎం దివాకర్ రావు,
ఎంఈవో, అనకాపల్లి-1

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మారిశెట్టి భాస్కరరావు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం పార్కు సెంటర్, అంబేడ్కర్ నగర్‌లో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి బీజేపీ 80వ వార్డు ఇన్‌చార్జ్ మారిశెట్టి భాస్కరరావు నివాళులర్పించారు. అనంతరం ముఖర్జీ జీవిత చరిత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ అటల్జీ మండల అధ్యక్షుడు కొమలపల్లి సన్యాసిరావు, శక్తి కేంద్ర ప్రముఖులు మద్దాల నాగశివ రాపేట్ సంతోష్, బల్లెం నర్సింగరావు, కర్రి పరదేశి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి -2గా సుమ



బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సుమ

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి -2గా ఎస్. సుమ సోమవారం బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా తూర్పు గోదావరి జిల్లా బోడిలంక పీహెచ్‌సీ నుంచి ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసే వైద్యాధికారి రమేష్ అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పాథాలజిస్టుగా ఏడు నెలల క్రితం బదిలీ కావడంతో ఆ పోస్టు ఇప్పటి వరకు ఖాళీగా ఉంది. ఇప్పుడు భర్తీ కావడంతో వైద్య సేవలు మరింత మెరుగుపడగలవని స్థానిక ప్రజలు భావిస్తున్నారు.

యోగాతో శారీరక, మానసిక చైతన్యం

అనకాపల్లి: యోగా అనేది భారతదేశ పురాతన అభ్యాసమని, యోగా, ధ్యానంతో శారీరక, మానసిక, ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందని హ్యాపీ కిడ్స్ కరస్పాండెంట్ శెట్టి గిరీష్ కుమార్ తెలిపారు. స్థానిక ఉడ్‌పేట హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్లో సోమవారం చిన్నారులతో యోగాసనాలు చేయించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి యోగాపై అవగాహన పెంచే విధంగా ప్రభుత్వ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రధాని మోదీ ప్రతిపాదన మేరకు ఐక్యరాజ్యసమితి ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు. మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కావాలంటే నిత్యం యోగాసనాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సునీత, తదితరులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న చిన్నారులు

చిత్తడి చిత్తడిగా..



వర్షానికి బురదమయంగా మారిన కశింకోట ఆర్టీసీ బస్ స్టేషన్



తాళ్లపాలెం గొర్రెలు, మేకల సంత దుస్థితి



నర్సీపట్నం రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

కశింకోట: మండల గ్రామాల్లో సోమవారం వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాలు చిత్తడిగా మారడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం దఫ దఫాలుగా కురిసింది. దీంతో కశింకోటలో ఆర్టీసీ బస్ స్టేషన్ బురదమయంగా మారింది. స్టేషన్‌లోకి ప్రయాణికులు రావడానికి తీవ్ర ఇబ్బంది పడ్డారు. కొన్ని బస్సులు స్టేషన్‌లోకి రాకుండా అట్నుంచి అటే జాతీయ రహదారి మీదుగా వెళ్లిపోవడంతో ఇక్కట్లు పడ్డారు. తాళ్లపాలెం వారపు గొర్రెలు, మేకల సంత బురదమయంగా మారింది. దీంతో వాటి కొనుగోలు, అమ్మకాలు సాగించడానికి వ్యాపారులు, పెంపకం, అమ్మకందారులు తీవ్ర ఇబ్బంది చెందారు. వర్షం వల్ల తక్కువ సంఖ్యలో గొర్రెలు, మేకలు సంతకు తీసుకు వచ్చారు. దీంతో లావాదేవీలు తగ్గాయి. ఇక కూరగాయల సంత చిత్తడిగా మారడంతో వాటిని కొనుగోలు చేయడానికి వచ్చిన ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. నర్సీపట్నం వైపు వెళ్లే రోడ్డులో సంత వద్ద నీరు నిలిచిపోవడంతో వ్యాపారులు, వాహన చోదకులు,ప్రజలు రాకపోకలకు ఇబ్బంది చెందారు.

వరి విత్తనాల కోసం ఎగబడిన రైతులు



కశింకోట వ్యవసాయ శాఖ కార్యాలయంలో వరి విత్తనాల కోసం నిరీక్షిస్తున్న రైతులు



రైతుల వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

కశింకోట: స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో సోమవారం వరి విత్తనాల కోసం రైతులు ఎగబడ్డారు. ఒకవైపు అడపా దడపా వర్షాలు కురుస్తుండటం, నారుమళ్లు వేయడానికి సమయం సమీపిస్తుండటంతో రైతులు విత్తనాల సేకరణపై దృష్టి నిలిపారు. వీటి కోసం ఉదయం రైతులు ఎక్కువ సంఖ్యలో వ్యవసాయ కార్యాలయానికి చేరుకొని నిరీక్షించి విత్తనాలు తీసుకెళ్లారు. వ్యవసాయ శాఖ సిబ్బంది రైతుల పేర్లను నమోదు చేసుకొని విత్తనాలను పంపిణీ చేశారు. ఆర్‌జీఎల్, సోనామసూరి, సాంబమసూరి, ఇతర రకాల విత్తనాలను రైతులు తమ ఇళ్లకు సైకిళ్లు, బైకులు, ఆటోల సహాయంతో తీసుకెళ్లారు. మండలంలోని పలు రైతు సేవా కేంద్రాల్లో కూడా విత్తనాల పంపిణీ చేపట్టారు.

మత్స్యకారుల ఆందోళన

నక్కపల్లి: అమలాపురంలో భూములకు నష్టపరిహారం మత్స్యకార సొసైటీకే చెల్లించాలంటూ మత్స్యకారులు చేస్తున్న ఆందోళన సోమవారం ఐదో రోజుకు చేరుకుంది. నష్టపరిహారం చెల్లించిన తర్వాత భూములు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే.

డిసెంబరులో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

అనకాపల్లి: జీవీఎంసీ గవరపాలెం చిన్న హైస్కూల్‌లో 1953 నుంచి ఈ ఏడాది మార్చి వరకూ పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక డిసెంబర్‌లో నిర్వహించనున్నట్లు సంబంధిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు బల్లా నాగభూషణం తెలిపారు. స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి రహదారి పిరమిడ్ ధ్యాన మందిరంలో సోమవారం రాత్రి సంఘం ఆత్మీయ కలయిక జరిగింది. ఆయన మాట్లాడుతూ దేశంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులకు సమాచారం అందిస్తామన్నారు. కుటుంబ సమేతంగా ఆత్మీయ కలయికను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బుద్ధ వీరునాయుడు, కొత్తూర్తి రామారావు, భీశెట్టి శివరామకృష్ణ, కె.పాపయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ లారీ పట్టివేత



నక్కపల్లి: మండలంలో రాజయ్యపేట, అమలాపురం తదితర ప్రాంతాల నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఉపమాక వద్ద ఈ లారీని పట్టుకున్నట్టు సీఐ కుమార స్వామి తెలిపారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

అనకాపల్లి టౌన్: పెన్షనర్ల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర పెన్షనర్ల అసోసియేషన్ కార్యదర్శి బుద్ధ కాశీ విశ్వేశ్వరావు కోరారు. స్థానిక జిల్లా పశ్చిమ ట్రెజరీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన సబ్ ట్రెజరీ ఆఫీసర్ వీవీ జోగారావును అసోసియేషన్ సభ్యులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కాశీ విశ్వేశ్వరావు మాట్లాడుతూ ప్రతి నెలా ఆరోగ్య బీమాకు భార్యాభర్తల పేరున నగదు వసూలు చేస్తున్నారన్నారు. తక్షణమే భార్య పేరుతో ఉన్న బీమా చెల్లింపును తొలగించాలని కోరారు. భార్య ఉద్యోగం చేస్తున్న పే స్లిప్‌లో పుట్టిన తేదీ లేకపోవడం వల్ల సమస్యలు వస్తున్నాయన్నారు. పెన్షనర్లకు పే స్లిప్‌లో పుట్టిన తేదీలు లేకపోవడం వల్ల క్వాంటం పెన్షన్ పొందేటప్పుడు కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కార్యక్రమంలో కాండ్రేగుల సత్యనారాయణ, ఎస్ మన్మథరావు, జోగారావు, యల్లపు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



సబ్ ట్రెజరీ ఆఫీసర్ జోగారావుకు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు

పోరు బాట



'యువత పోరు' కోసం అనకాపల్లి రింగురోడ్డు వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి నిరుద్యోగ యువతతో కలిసి ర్యాలీగా బయలుదేరిన పార్టీ అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, సీనియర్ నేత దంతులూరి దిలీప్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామ్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు -అనకాపల్లి

తాగునీటి సమస్యపై ఖాళీ బిందెలతో నిరసన



మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

సబ్బవరం: తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మండలంలోని ఇరువాడ శివారు ఎస్సీ, బీసీ కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. కాలనీ ఏర్పాటై 30 ఏళ్లవుతున్నా.. కనీస వసతులకూ నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ఎంపీడీవో బి.పద్మజకు తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీకి ఇరువాడ గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి నిధులు మంజూరు కావట్లేదని ఆరోపించారు. అసకపల్లి ఎంపీటీసీ పరిధిలోని తమ కాలనీకి మండల పరిషత్ నిధులు ఖర్చు చేయట్లేదని ఆక్షేపించారు. ఎప్పుడైనా ఎస్సీ గ్రాంట్ వస్తే తప్ప, ఎలాంటి అభివృద్ధికి తమ కాలనీ నోచుకోవట్లేదని వాపోయారు. మంచినీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకుందన్నారు. కిలో మీటర్ దూరం నుంచి పైప్‌లైన్లు వేసి మంచినీటిని పంపింగ్ చేస్తుండటంతో తరుచూ పైపులైన్‌లు పగిలి నీరు వృథా అవడంతోపాటు, తాగునీటి సమస్య తలెత్తుతోందన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరసన



ఆందోళన చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

నర్సీపట్నం : సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఐదు రోజులుగా ఆర్డీవో కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న తమను ఎవరూ పట్టించుకోవడం లేదని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలకు రూ.15 వేలు జీతం కాగా రూ.2 వేలు కటింగులు పోను రూ.13 వేలు చేతికి వస్తుదని, వచ్చిన వేతనం ఏమాత్రం సరిపోక కుటుంబ పోషణ భారంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇచ్చినప్పుడే తమ బతుకులు బాగు పడతాయంటున్నారు.